


గుండెపోటుతో రైతు మృతి

ప్రజాశక్తి - వీరఘట్టం



మండలంలోని చిట్టిపూడివలసకు చెందిన జక్కు కృష్ణ (65) సోమవారం తన పొలంలో పనిచేస్తుండగా ఒక్కసారిగా కుప్పకూలి మృతి చెందాడు. ఎప్పట్లాగే సోమవారం ఉదయం ఇంటి వద్ద అల్పాహారం తీసుకొని పొలంలో పనిచేసేందుకు వచ్చి పనిచేస్తుండగా గుండె పోటు రావడంతో అక్కడికక్కడ కుప్పకూలి పడిపోయాడు. దీంతో సమీప పంట పొలాల్లో పనిచేస్తున్న రైతులు కృష్ణ వద్దకు వచ్చి పరిశీలించిగా అప్పటికే మృతి చెందాడు. ఈ విషయాన్ని కుటుంబ సభ్యులకు తెలిపారు. వెంటనే కుటుంబ సభ్యులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని ఇంటికి తరలించారు.

అవస్థల నడుమ గిరిజన విద్య

పక్కా భవనాలు, ప్రహరీలు లేక విద్యార్థుల ఇబ్బందులు

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

గిరిజన విద్యకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని ఒకవైపు ప్రభుత్వం ప్రకటనలు చేస్తూ, మరోవైపు మన్యంలో గిరిజన విద్య విద్యార్థులకు అందని ద్రాక్ష గానే ఉంటుంది. పాఠశాలల్లోని సమస్యలపై ఎన్నోసార్లు విద్యార్థులు, వారి తల్లిదండ్రులు అధికారులకు విన్నవించినా ప్రయోజనం లేకుండా పోయింది. దీంతో ప్రతి ఏటా విద్యార్థులు అవస్థల నడుమ చదువులు సాగించాల్సిన దుస్థితి నెలకొంది. మండలంలోని పాఠశాలలనే ఇందుకు నిదర్శనం.

మండలంలోని 170 పాఠశాలల ఉన్నాయి. ఇందులో మండల పరిషత్ 56, ప్రభుత్వ ప్రాథమిక 32,ఆశ్రమ పాఠశాలలు 13, ఎయిడెడ్ 4, గిరిజన సంక్షేమ ప్రాథమిక పాఠశాలలు (జిపిఎస్) 65ఉన్నాయి. తాడికొండ, దుడ్డు ఖల్లు, కొత్తగూడ, కోసింగి భద్ర, టిక్కబాయి ఆశ్రమ పాఠశాలలకు ప్రహరీలు లేకపోవడంతో విద్యార్థులకు రక్షణ కరువైంది. అడవి, కొండల సమీపంలో పాఠశాలల నిర్వహణ ఉండడంతో రాత్రి వేళల్లో ఏదైనా అడవి జంతువు, విష సర్పాలు వచ్చే ప్రమాదం ఉందని విద్యార్థులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. గతంలో పాముకాటుకు గురై పలువురు విద్యార్థులు మృతి చెందిన సంఘటనలు ఉన్నాయి. మండలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో రన్నింగ్ వాటర్ అందుబాటులో లేకపోవడంతో మరుగుదొడ్ల వినియోగం లేకుండా పోయాయి. ఆశ్రమ పాఠశాలల్లో ఎఎన్ఎం పోస్టులు భర్తీ చేయకపోవడంతో వార్డెన్లను నియమించుకొని నెలవారీ కొంత మొత్తం చెల్లిస్తున్నారు. కొత్త ప్రభుత్వం ఏర్పాటుతోనైనా ఆశ్రమ పాఠశాలల్లో సమస్యలను పరిష్కరించి విద్యార్థులకు మెరుగైన విద్య, వైద్యం అందించే దిశగా చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులకు కోరుతున్నారు.



ఇరిడి ఎంపిపి పాఠశాల రేకుల షెడ్డులో విద్యార్థులకు తరగతుల బోధన



ప్రహరీ లేని కొత్తగూడ ఆశ్రమ పాఠశాల

పక్కా భవనం లేక రేకుల షెడ్డులోనే తరగతులు

గతనెల 13న పాఠశాలలు పునః ప్రారంభమైన పలుచోట్ల పక్కా భవనాలు లేకపోవడంతో విద్యార్థులకు రేకుల షెడ్డులోనే తరగతుల బోధన నిర్వహిస్తున్నారు. మండలంలోని ఇరిడిలో ఉన్న మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో 52 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఇక్కడ ఇద్దరు ఉపాధ్యాయులు విధులు నిర్వహిస్తున్నారు. అయితే నాడు నేడులో రూ.11 లక్షలతో పక్కా భవనం మంజూరైంది. పనులు ప్రారంభి ఏడాదైనా భవనం పూర్తి కాకపోవడంతో ఈ ఏడాది కూడా శుక్రవారం రేకుల షెడ్డులోనే తరగతులు ప్రారంభించారు. నత్త నడకన పనులు జరగడంతో విద్యార్థులు ఎండకు ఎండుతూ, వర్షానికి తడుస్తూ ఇబ్బందులు పడుతూ చదువులు సాగించాల్సి వస్తుంది. సంబంధిత విద్య, ఇంజనీరింగ్ శాఖ అధికారులు స్పందించి పనులు త్వరితగతిన పూర్తి చేయాలని కోరుతున్నారు.

స్థానిక వనరులతో పనులు పూర్తి చేయాలి : కలెక్టర్

ప్రజాశక్తి - సీతంపేట

స్థానిక వనరులను ఉపయోగించి పనులు పూర్తి చేయాలని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ అన్నారు. ప్రజా సమస్యల పరిష్కారం వేదికలి కార్యక్రమాన్ని సోమవారం స్థానిక ఐటిడిఎ సమావేశ మందిరంలో నిర్వహించారు. ఐటిడిఎ పిఒ సి.విష్ణు చరణ్, పాలకొండ ఆర్‌డిఒ వివి రమణతో కలిసి ప్రజల నుంచి కలెక్టర్ వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ సామాజిక ఆధారిత అవసరాలపై ఎక్కువ అర్జీలు అందుకున్నట్లు చెప్పారు. సిసి రోడ్లు, రక్షణ గోడలు, ఆసుపత్రి సేవలు, ఉపాధిహామీ పనులు తదితరాలు ఉన్నాయని తెలిపారు. ఫిర్యాదుల పరిష్కారానికి చిత్తశుద్ధితో కృషి చేయాలని సూచించారు. పనులను పూర్తి చేయడానికి, గ్రామ స్థాయి వనరులు, ప్రజల సేవలను వినియోగించు కోవాలని తద్వారా పనులు త్వరగా కార్యరూపం దాల్చుతాయని తెలిపారు. ఇంజినీరింగ్ పనులన్నింటినీ ఇంజినీరింగ్ అసిస్టెంట్లు సమన్వయం చేయాలన్నారు. ఆసుపత్రుల్లో సదరం సర్టిఫికెట్లకు వెళ్లేందుకు కూపన్లు జారీ చేసేందుకు గ్రీవెన్స్ వద్ద సదరం కౌంటర్‌ను ఏర్పాటు చేయాలన్నారు. టెట్, డిఎడ్, బిఎడ్ అభ్యర్థులకు శిక్షణ ఇచ్చేందుకు ఆసక్తి గల ఉపాధ్యాయులను గుర్తించి శిక్షణ ఇవ్వొచ్చనని తెలిపారు. సంతల వద్ద విశ్రాంతి స్థలాలు, విద్యుత్ దీపాలు , తాగు నీరు తదితర సౌకర్యాలు ఏర్పాటు చేయాలని, ఇవి సీతంపేట, కుసిమి నుంచి ప్రారంభించాలని ఆదేశించారు. విద్యార్థికి పాఠ్యాంశాల్లో హ్యాండ్ వాష్‌ను భాగం చేయాలని, పరిశుభ్రమైన ఆహారాన్ని అందించాలని అన్నారు. డిప్యూటీ డిఇఒ వీటిని పరిశీలించి నివేదిక సమర్పించాలని తెలిపారు. పాఠశాలల్లో పనితీరు ఆధారిత సూచిక ఉండాలని సూచించారు. పిల్లల్లో పౌష్టికాహార లోపం, బరువు తక్కువగా ఉండకూడదని, ఐసీడీఎస్ పర్యవేక్షణ చేయాలని సూచించారు.



ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

వినతులతో పోటెత్తిన గ్రీవెన్స్

జిల్లా కలెక్టర్ మొట్టమొదటిసారిగా సీతంపేటలో వచ్చి ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో స్వయంగా ఆయన వినతులు స్వీకరించడంతో అర్జీదారులతో గ్రీవెన్స్ పోటెత్తింది. మూడు రోజుల క్రితమే కలెక్టర్ వస్తున్నట్లు పత్రికల్లో వార్త రావడంతో అర్జీదారులు తరలివచ్చారు. దీంతో 142 వినతులు వచ్చాయి. ఈ కార్యక్రమంలో అన్ని శాఖల జిల్లా ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ఆసుపత్రిలో కలెక్టర్ తనిఖీ

స్థానిక ఏరియా ఆసుపత్రిని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ సోమవారం తనిఖీ చేశారు. సీతంపేటలో ప్రజా సమస్యల పరిష్కారం వేదిక నిర్వహించిన అనంతరం ఆసుపత్రిని తనిఖీ చేశారు. ఆసుపత్రిలో అందుతున్న సేవలు, అందిస్తున్న వైద్యంపై ఆరా తీశారు. వైద్యులపై నమ్మకంతో ప్రజలు వస్తారని, వారికి మంచి వైద్యం అందించాలని ఆయన అన్నారు. ఆసుపత్రిని పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఆయన సూచించారు. వచ్చే గిరిజనులకు సరైన మార్గదర్శకం, సూచనలు, సలహాలు ఇవ్వాలని చెప్పారు. మందులన్నీ సిద్ధంగా ఉండాలన్నారు. వర్షాకాలం ప్రారంభమవుతుందని, కావున వైద్యులు అప్రమత్తంగా ఉండాలని స్పష్టం చేశారు. రేయింబవళ్లు మంచి సేవలు అందించాలని సూచించారు. కలెక్టర్ వెంట ఆసుపత్రి సూపరింటెండెంట్ బి.శ్రీనివాసరావు, వైద్యులు ఉన్నారు.




ఆస్పత్రిలో రోగితో మాట్లాడుతున్న కలెక్టర్

శివ్వాం దళితులకు న్యాయం చేయాలి

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

శివ్వాం దళితులపై దాడిచేసిన పెత్తందారులను తక్షణమే అరెస్టు చేయాలని, జిల్లాలో గిరిజనులు, దళితులు, పేదలు సాగు చేస్తున్న భూములకు పట్టాలివ్వాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ఎం.కృష్ణమూర్తి డిమాండ్ చేశారు. ఈ మేరకు స్థానిక కలెక్టరేట్ వద్ద బాధిత దళితులు సోమవారం చేపట్టిన రిలే నిరాహార దీక్షలను ఆయన ప్రారంభించారు. అనంతరం కృష్ణమూర్తి మాట్లాడుతూ శివ్వాంలో దళితులకు 1970లో సర్వే నెంబర్ 20 నుంచి 30 వరకు 14 మందికి 22 ఎకరాల 80 సెంట్లు భూమికి డి-పట్టాలిచ్చారన్నారు. అప్పటి నుంచి దళితులు ఆ భూమిని సాగు చేసుకుంటున్నారన్నారు. కొంతమంది పెత్తందారులకు ఆ భూమిపై కన్ను పడిందని, ఆ భూమిని ఎలాగైనా లాగేయాలని, దళితులకు ఇచ్చిన భూముల సర్వే నెంబర్లతో సంబంధం లేకుండా సర్వే నెంబరు 102లో హద్దులు వేసి ఫేక్ ఇంజక్షన్ ఆర్డర్‌ను కోర్టు వారిని తప్పు పట్టించి తీసుకొచ్చారని తెలిపారు. అప్పటి నుంచి రెవెన్యూ, పోలీస్ అధికారులు దళితులను భూమ్మీదకు వెళ్లొద్దని దౌర్జన్యం చేశారన్నారు. ఈ ఏడాది దళితులు వరి నాట్లు వేయడానికి నారు సిద్ధం చేస్తుండగా పెత్తందార్లు వచ్చి దాడి చేసి ఐదుగురు దళితుల్ని గాయపర్చారన్నారు. దీనిపై పాలకొండ డిఎస్‌పి విచారణ చేపట్టారని, అయినా ఇంతవరకు ఒక్క పెత్తందారుడిపై చర్యలు తీసుకోలేదని అన్నారు. ఇప్పటికైనా దళితులను కొట్టి, తిట్టిన పెత్తందార్లను వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. అలాగే పెత్తందార్లకు కొమ్ముకాస్తున్న రెవెన్యూ అధికారులపై కలెక్టర్ చర్యలు తీసుకోవాలని కోరారు. పాచిపెంట నుంచి ఇటు భామిని వరకు గల గిరిజన, మైదాన ప్రాంతాల్లోని గిరిజన, దళిత, పేదల భూములు గత 50 ఏళ్లుగా అన్యాక్రాంతమవుతున్నాయని, ఆ భూములన్నింటినీ సర్వే చేసి వెంటనే పేదలకు అప్పజెప్పాలని కోరారు. జిల్లాలో పేదలు, గిరిజనులు, దళితులు సాగు చేస్తున్న భూములకు అన్నింటికీ డి-పట్టా మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రెడ్డి ఈశ్వరరావు, కొల్లి గంగనాయుడు, సహాయ కార్యదర్శి మర్రి శ్రీనివాసరావు, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వై.మన్మధరావు, సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు, నాయకులు బివి రమణ, సిపిఐ నాయకులు జీవ, కుమార్, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు గరుగుబిల్లి సూరయ్య, బంకరు సూరిబాబు, పి.రాము పాల్గొన్నారు.

కలెక్టరేట్ వద్ద బాధితుల రిలే నిరాహార దీక్షలు



రిలే నిరాహారదీక్షనుద్దేశించి మాట్లాడుతున్న రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ఎం. కృష్ణమూర్తి

అంగన్వాడీ కార్యకర్తపై మొక్కుబడి విచారణ

ప్రజాశక్తి - సాలూరు

పట్టణానికి చెందిన అంగన్‌వాడీ కార్యకర్త బి.రాధ అక్రమ వసూళ్లపై ఐసిడిఎస్ అధికారులు చేపట్టిన విచారణ మొక్కుబడిగా ముగిసింది. ఐసిడిఎస్ అధికారులను ప్రసన్నం చేసుకోవడానికి వారు వచ్చినప్పుడల్లా కార్యకర్తల నుంచి రాధ డబ్బులు వసూలు చేస్తున్నారని, కార్యకర్తలకు అప్పులిచ్చి అధిక వడ్డీలు వసూలు చేస్తున్నారని, ఐసిడిఎస్ అధికారులను చెప్పుచేతల్లో పెట్టుకొని తమను వేధింపులకు గురి చేస్తున్నారని ఆరోపిస్తూ ఇటీవల పలువురు అంగన్వాడీ కార్యకర్తలు స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి సంధ్యారాణికి ఫిర్యాదు చేశారు. అంతే కాక ఆమె నుంచి తమకు ప్రాణహాని ఉందని కూడా టౌన్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. ఈ ఆరోపణలపై స్పందిస్తూ ఐసిడిఎస్ పీడీ ఎంఎన్ రాణి సిడిపిఒ బి.సత్యవతితో కలిసి గుమడాం వైటిసి కార్యాలయంలో సోమవారం విచారణ చేపట్టారు. కార్యకర్తలకు ఆరోపణలకు సంబంధించి ప్రశ్నపత్రాలను అందజేసి జవాబులు రాబట్టే ప్రయత్నం చేశారు. దీంతో విచారణ మొక్కుబడిగా సాగినట్లు తెలిసింది. అన్నింటికి మించి ఆమె చాలా కాలంగా వడ్డీ వ్యాపారం కూడా చేస్తున్నట్లు కార్యకర్తలు చెబుతున్నారు. అప్పులిచ్చి అధిక వడ్డీలు వసూలు చేయడానికి అప్పులు తీసుకున్న అంగన్వాడీ కార్యకర్తల ఎటిఎం కార్డులు కూడా రాధ తన వద్ద ఉంచుకుంటున్నారనే ఆరోపణలు వచ్చాయి. అంగన్వాడీ కేంద్రాలకు బిల్లులు మంజూరైనప్పుడల్లా అధికారులకు ఇవ్వాలని పది పర్సంటేజ్ వరకు వసూలు చేసినట్లు కార్యకర్తలు ఆరోపిస్తున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో రాధపై కార్యకర్తలు చేసిన ఆరోపణలపై ఐసిడిఎస్ అధికారులే విచారణ చేపట్టడం అనుమానాస్పద మవుతోంది. సొంతశాఖ అధికారులు కాకుండా ఇతర శాఖల అధికారులతో విచారణ జరిపించాలని కార్యకర్తలు డిమాండ్ చేస్తున్నారు.

మంత్రి దృష్టి పెట్టాలి

మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సంధ్యారాణి స్థానిక ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలో జరుగుతున్న అక్రమ వసూళ్లపై ప్రత్యేక దృష్టి సారించాలని పలువురు కోరుతున్నారు. అంగన్‌వాడీ కార్యకర్త రాధపై ఆరోపణల నేపథ్యంలో ఐసిడిఎస్ అధికారులతో విచారణ జరపకుండా ఇతర శాఖల అధికారులతో విచారణకు మంత్రి ఆదేశించాలని కోరుతున్నారు.



అంగన్‌వాడీ కార్యకర్తలతో మాట్లాడుతున్న ఐసిడిఎస్ అధికారులు

విచారణ నివేదిక కలెక్టర్‌కు అందజేస్తాం

ప్రాజెక్టు పరిధిలో ఉన్న కొందరు అంగన్వాడీ కార్యకర్తలు చేసిన ఆరోపణలపై విచారణ జరిపి నివేదిక జిల్లా కలెక్టర్‌కు అందిస్తాం. రాధ స్ఫూర్తి మహిళా సంఘం అనే స్వచ్ఛంద సంస్థను నడుతుండడం నిబంధనలకు విరుద్ధమైతే చర్యలు తీసుకుంటాం.

ఎంఎన్ రాణి
ఐసిడిఎస్ ప్రాజెక్టు డైరెక్టర్

గిరిజన విద్యకు అధిక ప్రాధాన్యత : ఎమ్మెల్యే

విద్యార్థుల సమస్యలు పరిష్కరిస్తామని హామీ

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

ఏజెన్సీ ప్రాంతంలో ఉన్న గురుకులాలు, ఆశ్రమ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల సమస్యలను పరిష్కరించి విద్యకు అధిక ప్రాధాన్యత ఇస్తామని ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి అన్నారు. మండలంలోని భద్రగిరి పిటిజి గిరిజన గురుకుల బాలికల పాఠశాల, కళాశాలను సోమవారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ విద్యార్థులకు వైద్యం అందించాల్సిన ఆరోగ్య కార్యకర్తలను తొలగించడంతో విద్యార్థులకు సేవలందని పరిస్థితి ఉందన్నారు. టిడిపి అధికారంలోకి వచ్చిన తర్వాత విద్యార్థుల సంక్షేమం, ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపిస్తున్నామన్నారు. ప్రతి విద్యార్థి ఆహ్లాదకరమైన వాతావరణంలో చదువుకునేలా అన్ని రకాల మౌలిక వసతులు కల్పిస్తామని ఆమె చెప్పారు. ప్రతి ఆశ్రమ పాఠశాలలో ఆరోగ్య కార్యకర్తలను నియమించే దిశగా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. అనంతరం విద్యార్థులకు ప్రభుత్వం పంపిణీ చేసిన యూనిఫారంలను పంపిణీ చేశారు. ఎమ్మెల్యే తన సొంత నిధులతో కొనుగోలు చేసిన అట్టలు, నోట్ బుక్స్, పెన్నులు పంపిణీ చేశారు. అనంతరం శిథిలమైన విద్యార్థుల డార్మెటరీని పరిశీలించారు. కొత్త భవనం మంజూరుకు ప్రతిపాదనలు పంపిం చాలనే సంబంధిత భద్రగిరి ఇంజనీరింగ్ ఎఇ అప్పారావుకు ఎమ్మెల్యే సూచించారు. భద్రగిరి గురుకుల కళాశాల సందర్శించి ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇరు పాఠశాల ఉపాధ్యా యులు ఎమ్మెల్యేను సన్మానించారు. కార్యక్రమంలో అరకు పార్లమెంట్ అధికార ప్రతినిధి డొంకాడ రామకృష్ణ, ఎస్టీ సెల్ అధికార ప్రతినిధి నందివాడ కృష్ణబాబు, టిడిపి సీనియర్ నాయకులు కద్రక కళావతి, రొబ్బ లోవరాజు, సొంటేన రాజేష్, అడ్డాకుల నరేష్, మండంగి ప్రసాదరావు, తాడంగి లక్ష్మణరావు, మండల కార్యదర్శి పోలూరు శ్రీనివాసరావు, ప్రిన్సిపల్ సురేష్ కుమార్, సత్యవతి, ఉపాధ్యాయులు ఉన్నారు.



విద్యార్థులకు యూనిఫాంలు అందజేస్తున్న ఎమ్మెల్యే జగదీశ్వరి

ఫిర్యాదుపై పీడీ విచారణ

ప్రజాశక్తి - భామిని

పనికి వెళ్లకుండా కొందరి పేర్లను నమోదు చేసి, వేతనాలు చెల్లించారనే ఫిర్యాదుపై సోమవారం డ్వామా పీడీ కె.రామచంద్రరావు మండలంలోని లివిరి సచివాలయంలో విచారణ చేపట్టారు. పనులకు వెళ్లిన వారి పేరున హాజరు వేసి బిల్లులు చేసుకుంటున్నారని గజపతినగరానికి చెందిన శివ డ్వామా పీడీకి ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఎపిఒ తులసీదాస్‌ను క్షేత్ర స్థాయిలో ఉపాధి పనులు పరిశీలన, కూలీల సంఖ్య, హాజరు, పరిశీలన తదితర అంశాలపై ప్రశ్నించారు. ఇది వాస్తవమా కాదా అని టెక్నీకల్, ఫీల్డ్ అసిస్టెంట్‌ని నిలదీశారు. ఉపాధి పనికి వెళ్లకుండా హాజరు నమోదు చేసి, ఉపాధి వేతనం అందుకున్నారని ఫిర్యాదులో పేర్కొన్న పేర్లు గల ఇంటికి వెళ్లి, పూర్తి స్థాయిలో వివరాలు అడిగి తనకు తెలపాలని ఎపిఒను ఆదేశించారు. వాస్తవమైతే బాధ్యులైన సిబ్బందిపై చర్యలు తప్పవని, ఇటువంటివి ఎక్కడా జరగడానికి వీల్లేదని హెచ్చరించారు. ఈ విచారణలో ఎపిడి శ్రీహరి, లివిరి పంచాయతీ కార్యదర్శి విశ్వేశ్వరరావు, సచివాలయం పాల్గొన్నారు.

నేటి నుంచి పారిశుధ్య వారోత్సవాలు

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

జిల్లాలో ఈనెల 16నుంచి ఆగస్టు 2 వరకు పారిశుధ్య వారోత్సవాలు నిర్వహించనున్నట్లు కలెక్టరు ఎ. శ్యామ్ ప్రసాద్ తెలిపారు. ఈ వారోత్సవాల ఏర్పాట్లు, సన్నద్ధతపై అధికారులతో సోమవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టరు సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వారోత్సవాలకు ప్రజాప్రతినిధులను ఆహ్వానించాలని, ఇంటింటికి కరపత్రాల పంపిణీ చేయాలని తెలిపారు. మండల ప్రత్యేక అధికారులు ప్రతిరోజు పర్యవేక్షించాలని, ప్రతిరోజు సాయంత్రం ఆరోజు చేపట్టిన కార్యక్రమ వివరాలను ఫోటోలతో పాటు పంపించాలని తెలిపారు. పారిశుధ్యం నిర్వహణ, పరిసరాల పరిశుభ్రత, ఆరోగ్యం, భోజనం చేసే ముందు చేతులు పరిశుభ్రతపై ప్రజలకు, విద్యార్థులకు, స్వయం సహాయక సంఘాల సభ్యులకు, ఉపాధి హామీ సంఘ సభ్యులకు అవగాహన సదస్సులు ఏర్పాటు చేయాలని తెలిపారు. పాఠశాలల్లో జంగిల్ క్లియరెన్స్, పారిశుధ్యం, మంచినీటి వనరులు నిర్వహణ కార్యక్రమాలను నిర్వహించాలని డిఇఒను ఆదేశించారు. గ్రామాల్లో పాఠశాలలు, కార్యాలయాల్లో జంగిల్ క్లియర్ చేసేటప్పుడు విష సర్పాల పట్ల సిబ్బంది ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, ప్రాథమిక చికిత్స కిట్ సిద్ధంగా ఉంచుకోవాలని తెలిపారు. గ్రామాల్లో మురుగునీటి నిల్వల గుంతలను పూడ్చేందుకు ఉపాధిహామీ చట్టాన్ని అనుసంధానించుకొని పనిచేయాలన్నారు. ఫాగింగ్ మిషన్లు సిద్ధంచేసుకోవాలని, ఒహెచ్ఎస్ఆర్ ట్యాంకులను శుభ్రపరచాలని, మంచినీటి నాణ్యత పరీక్షించాలని జిల్లా ఎక్కడైనా డయేరియా ఉన్నట్లు గుర్తిస్తే మంచినీటివనరులు కలుషితమైతే, ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసి మంచినీరు సరఫరా చేయాలన్నారు. మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేయాలని తెలిపారు. పారిశుధ్య వారోత్సవాలు నిర్వహణలో పంచాయతీలకు గ్రేడింగు యివ్వడం జరుగుతుందని, చక్కని ఫలితాలు సాధించిన పంచాయతీని గుర్తించి స్వాంతంత్ర్యదినోత్సవం సంధర్భంగా అవార్డుకు సిఫార్సు చేయాలని అధికారులను అదేశించారు. సమావేశంలో ఐటిడిఎ పిఒ సి.విష్ణు చరణ్, డిఆర్‌డిఎ, డ్వామా పీడీలు వై.సత్యంనాయుడు, కె.రామచంద్ర రావు, జిల్లా ఆర్‌డబ్ల్యుఎస్ ఇంజినీరింగ్ అధికారి ఒ.ప్రభాకరరావు, డిపిఒ బలివాడ సత్యనారాయణ, డిఇఒ జి.పగడాలమ్మ, జిల్లా వ్యవసాయ అధికారి కె.రాబర్ట్ పాల్, మున్సిపల్ కమిషనర్లు, ఎంపిడిఒలు, వైద్యాధికారులు పాల్గొన్నారు.

సహారా ఖాతాదారులను ఆదుకోవాలి

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

సహారా సంస్థలో డబ్బులు దాచుకున్న ఖాతాదారులకు వారి బ్యాంకు ఖాతాలో డబ్బులను జమ చేసేందుకు కేంద్రప్రభుత్వం చర్యలు చేపట్టాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు రెడ్డి వేణు డిమాండ్ చేశారు. ఈ మేరకు సిఐటియు ఆధ్వర్యంలో సోమవారం స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ నుండి కలెక్టరేట్ వరకూ ఖాతాదారులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. అనంతరం కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో డిఆర్ఒ కేశవనాయుడుకు వినతిని అందజేశారు. ఈ సందర్భంగా వేణు, సిఐటియు జిల్లా ప్రధానకార్యదర్శి వై.మన్మధరావు, కోశాధికారి గొర్లి వెంకటరమణ, మాట్లాడుతూ 2009-10లో మొదలైన సహారా రియల్ ఎస్టేట్ కార్పొరేషన్, హౌసింగ్ కార్పొరేషన్ బాండ్లకు వ్యతిరేకంగా అక్రమ వసూలు చేశారని, వారిపై కేసు నమోదైందని, ఈ మేరకు 2012లో 10శాతం వడ్డీతో కలిపి ఖాతాదారులకు తిరిగి చెల్లింపు చేయమని సుప్రీంకోర్టు ఆదేశాలు ఇచ్చిందని పేర్కొన్నారు. కానీ సహారా సంస్థ ఎవరికీ తెలియకుండా సహారా కంపెనీ క్యూ షాప్ బాలుగా మార్చి వేసి డబ్బులు ఇచ్చేశామని అబద్దాలు చెప్పిందని తెలిపారు. 2018లో క్యూ షాప్ బాండ్స్ డబ్బులు ఇస్తామని చెప్పి వాటిని సహారా క్రెడిట్ కో-ఆపరేటివ్ సొసైటీని స్టార్స్ మల్టీ పర్పస్ కోపరేటివ్ సొసైటీలో డబ్బులు మళ్లించిందని తెలిపారు. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు సిఆర్‌సిఎస్ పోర్టల్ ద్వారా దేశంలోని ఖాతాదారులకు డబ్బులు చెల్లిస్తామని 2023 జూలై 18న కేంద్ర మంత్రి అమిత్ షా చెప్పారని గుర్తు చేశారు. అయితే నేటికీ ఖాతాదారుల అకౌంట్లో డబ్బులు చెల్లింపు జరగలేదని, దీంతో ఖాతాదారులు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కావున ప్రభుత్వం స్పందించి ఖాతాదారుల అకౌంట్లో సహారా ఇండియా సంస్థ డబ్బులు జమ చేసేలా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు కొల్లి సాంబమూర్తి, పలువురుఖాతాదారులు పాల్గొన్నారు.



డిఆర్ఒకు వినతిని అందజేస్తున్న సిఐటియు నాయకులు, సహారా బాధితులు

తల్లికి వందనంపై అసత్య ప్రచారం తగదు

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

తల్లికి వందనం పథకంపై వైసిపి నాయకులు అసత్య ప్రచారం తగదని మాజీ ఎమ్మెల్యే బొబ్బిలి చిరంజీవులు అన్నారు. సోమవారం ఆయన జన్మదినం సందర్భంగా శుభాకాంక్షలు తెలియజేయడానికి వచ్చిన టిడిపి నాయకులను కార్యకర్తలను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. సిఎం చంద్రబాబు ప్రకటించిన సూపర్ సిక్స్‌లో పథకాలన్నీ అమలు చేస్తారని, ఇంకా విధివిధానాలు ప్రకటించని తల్లికి వందనం పథకంపై వైసిపి అసత్య ప్రచారం తగదన్నారు. ప్రజలు ఇచ్చిన తీర్పు తర్వాతైన వారి తీరు మారకపోవడం దారుణమని విమర్శించారు. అధికారంలోకి వచ్చిన నెలలోనే ఉచిత ఇసుక, డిఎస్‌సి ప్రకటన, టైటిలింగ్ యాక్ట్ రద్దు, పింఛన్ రూ.4 వేలకు పెంపు వంటి పథకాలు అమలు చేశారన్నారు. కార్యక్రమంలో ఎఎంసి మాజీ చైర్మన్ రెడ్డి శ్రీనివాసరావు, కోనపురెడ్డి ప్రసాదు, బలగ శంకరరావు పాల్గొన్నారు.


నిరసన తెలుపుతున్న పారిశుధ్య కార్మికులు

పారిశుధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించండి

ప్రజాశక్తి -సీతానగరం

వివిధ ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సిఐటియు ఆధ్వర్యాన కార్మికులు స్థానిక ఎంపిడిఒ కార్యాలయం వద్ద సిఐటియు నాయకులు జి.వెంకటరమణ,వై.శాంతి కుమారి ఆధ్వర్యంలో సోమవారం ధర్నా చేశారు. ఈ ధర్నానుద్దేశించి వారు మాట్లాడుతూ పాఠశాలల్లో మరుగుదొడ్లు శుభ్రం, పారిశుధ్య నిర్వహణ చేస్తున్న స్కూల్ స్వీపర్లకు ప్రభుత్వమే చీపుర్లు సరఫరా చేయాల్సి ఉన్నా తామే కొనుక్కుంటున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. సకాలంలో ప్రతినెలా వేతనాలు చెల్లించాలని, సబ్బులు, గ్లౌజులు, కొబ్బరి నూనె సరఫరా చేయాలని, యూనిఫాం, గుర్తింపు కార్డులు ఇవ్వాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో స్కూల్ స్వీపర్లు ఉష, గౌరమ్మ, తిలోత్తమ, సత్యవతి తదితరులు పాల్గొన్నారు.


సమస్యలు వింటున్న ఎమ్మెల్యే బోనెల విజయ్ చంద్ర

సమస్యల పరిష్కారానికి ప్రజా దర్బార్

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

నియోజకవర్గంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు ప్రజాదర్బార్ చక్కని వేదిక అని పార్వతీపురం ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర అన్నారు. సోమవారం ఆయన తన క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన ప్రజా వేదికలో పలువురు సమస్యల పరిష్కారం కోరుతూ దరఖాస్తులు సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి సోమవారం తన క్యాంపు కార్యంలో ప్రజలకు అందుబాటులో ఉంటానని అధికారులు దగ్గర పరిష్కారం కానీ సమస్యలు ఏమైనా ఉంటే తన వద్దకు తీసుకురావాలని కోరారు. నియోజకవర్గ సమస్యలపై అవగాహన పెంచుకొని వాటి పై అధికారులతో కలిసి సాధ్యాసాధ్యాలను చర్చించి త్వరలోనే పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు బార్నాల సీతారాం తదితరులు పాల్గొన్నారు.


కార్యదర్శులతో మాట్లాడుతున్న ఎంపిడిఒ సుబ్రహ్మణ్యం

నేటి నుంచి పారిశుధ్య వారోత్సవాలు

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని ఈనెల 16వ తేదీ నుంచి ఆగస్టు 2 పారిశుధ్య వారోత్సవ కార్యక్రమాలు పక్కగా నిర్వహించాలని ఎంపిడిఒ ఎంవిబి సుబ్రహ్మణ్యం సచివాలయ కార్యదర్శులకు ఆదేశించారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సచివాలయ కార్యదర్శులతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. మంచినీటి పథకాలకు క్లోరినేషన్ చేయడం, వీధులలోనే చెత్త చదరాలు తొలగించడం, మంచినీటి పథకాలకు బోర్డులు రాయడం, చెత్త సంపద కేంద్రాల ఆహ్లాదకరంగా ఏర్పాటు చేయడం తదితర అంశాలపై అవగాహన కల్పించారు. షెడ్యూల్ ప్రకారం కార్యక్రమాలు పక్కాగా నిర్వహించాలని సూచించారు.

విద్యార్థులతో ర్యాలీ నిర్వహించాలి

ప్రజాశక్తి - జియ్యమ్మవలస

విద్యార్థులతో పారిశుధ్యంపై గ్రామాల్లో ర్యాలీలు నిర్వహించాలని ఎంఇఒ ముదిరి శ్రీనివాసరావు తెలిపారు. స్థానిక జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో సోమవారం మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో గల ప్రభుత్వ పాఠశాలల పనితీరు, ఉపాధ్యాయుల సమయపాలన పాటించడం వంటి అంశాలతో పాటు విద్యార్థులకు విద్యా కానుక కిట్లు అందించడంపై ఆరా తీశారు.

మహదేవివలసలో ఫ్యామిలీ డాక్టర్


ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని చలివేంద్రి సచివాలయ పరిధిలో గల మహదేవివలసలో సోమవారం 104 ఆధ్వర్యంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక వైద్యాధికారి ప్రదీప్ కుమార్ చంటి పిల్లలు, రక్తపోటు, మధుమేహం, జ్వర పీడుతుల తదితర వ్యాధులకు వైద్య తనిఖీలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పి, ఎఎన్ఎం, ఆశా కార్యకర్తలు, 104 సిబ్బంది పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను సత్కరించిన పవన్

ప్రజాశక్తి- పాలకొండ

మంగళగిరిలోని జనసేన పార్టీ కార్యాలయంలో ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌ను పాలకొండ ఎమ్మెల్యే నిమ్మక జక్రష్ణను సోమవారం కలిశారు. ఈ సందర్భంగా పవన్ ఎమ్మెల్యేను ఘనంగా సత్కరించారు. పార్టీలకు అతీతంగా పనిచేయాలని ఈ సందర్భంగా పవన్ సూచించినట్లు ఎమ్మెల్యే తెలిపారు.


ఎమ్మెల్యేను సత్కరిస్తున్న పవన్

బాబోయ్ కుక్కలు

పెరుగుతున్న బాధితులు

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

నిన్న మొన్నటి వరకు గుమ్మలక్ష్మీపురం మన్యంలో ఏనుగులు, ఎలుగుబంట్లు బెడద ఉండగా, వాటి ముప్పు తప్పిందనుకుంటున్న తరుణంలో ప్రస్తుతం కుక్కల బెడద ప్రజలను వెంటాడుతుంది. గ్రామాల్లో ఎక్కడ చూసినా కుక్కలు గుంపు గుంపులుగా సంచరిస్తుండడంతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు. మండలంలోని గుమ్మ గదబ వలసకు చెందిన ఎడ్ల పరదేశి కుక్కకాటుతో భద్రగిరి ప్రభుత్వాసుపత్రిలో వైద్యం కోసం వచ్చాడు. రెండు నెలల క్రితం జియ్యమ్మవలస మండలంలో కేవలం నాలుగు రోజుల వ్యవధిలో ఇద్దరు వ్యక్తులను కుక్కలు చంపిన సంఘటన మరువకముందే గుమ్మలక్ష్మీపురం మండలంలో కూడా కుక్కలు ప్రజలను భయకంపితులను చేస్తున్నాయి. ఎక్కడికైనా ఒంటరిగా వెళ్తే ఎటు నుంచి వచ్చి ఏ కుక్క కాటు వేస్తుందోనని ప్రజలు భయపడుతున్నారు. కుక్కల నుంచి రక్షించాలని ప్రజలు కోరుతున్నారు.


గాయాన్ని చూపిస్తున్న బాధితుడు

ఫీల్డ్ అసిస్టెంట్‌పై రాజకీయ వేధింపులు ఆపాలి

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

జియ్యమ్మవలస జోగులుడుమ పంచాయతీ ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న క్షేత్ర సహాయకురాలు బూరి నాగమణిపై రాజకీయ వేధింపులు ఆపాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వై.మన్మధరావు కోరారు. రాజకీయ కక్షతో స్థానిక నాయకులు ఫిర్యాదులతో, తప్పుడు సమాచారంతో ఆమెను సస్పెండ్ చేయడం దారుణమని, ఇప్పటికైనా ఆమెపై రాజకీయ వేధింపులు ఆపి ఆమెను విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. సోమవారం జిల్లా ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ల సంఘం కార్యదర్శి హరినాథ్ రావుతో కలిసి జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించిన అనంతరం జిల్లా రెవెన్యూ అధికారికి వినతి అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ఏనిమిదేళ్లుగా గ్రామంలో మంచి క్షేత్ర సహాయకురాలుగా పేరు తెచ్చుకొని ఉపాధి హామీ వేతనదారుల మన్ననలను పొందుతున్న ఆమెపై జియ్యమ్మవలస ఎంపిడిఒ బొంగు సురేష్ తప్పుడు నేరారోపణలు చేసి, తన పలుకుబడిని అధికారుల దగ్గర వినియోగించి ఆమెను సస్పెండ్ చేయడం అన్యాయమన్నారు. ఆమెపై బహిరంగ విచారణ నిర్వహించకుండా, వేతనాదారులను ఎవ్వరిని లోపలకు రానీయకుండా ఒక గదిలో పోలీసు సహకారంతో నిర్వహించి ఆమెచే సంతకాలు బలవంతంగా తీసుకొని సస్పెండ్ చేశారని ఆరోపించారు. తాను చేస్తున్న ఉద్యోగం ఉండాలంటే రూ.5 లక్షలు లంచం ఇవ్వాలని ఎంపి అడిగారని దానికి ఆమె తిరస్కరించడంతో ఆమెపై ఫిర్యాదు చేసిన వారితో రోజుకో విధంగా నుంచి తొలగించడం అన్యాయమని అన్నారు. ఈ విషయంపై జిల్లా అధికారులు సమగ్ర విచారణ జరిపి ఆమెను విధుల్లోకి తీసుకోవాలన్నారు.

కుంతేసు పంచాయతీ సమస్యలను పరిష్కరించాలి

పార్వతీపురం టౌన్: కొమరాడ మండలం కుంతేసు పంచాయతీ సమస్యలను పరిష్కరించాలని రైతు కూలీ సంఘం నాయకులు హిమరక మిన్నారావు డిమాండ్ చేశారు. సోమవారం జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయం వద్ద నిరసన తెలియజేసి ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఉన్న డిఆర్ఒకి వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమకు ఎంతోకాలంగా స్కూల్ బిల్డింగ్‌లు, అంగన్‌వాడీ భవనం లేవని దీని వల్ల 30 మంది విద్యార్థులు చెట్ల కింద చదువుకోవాల్సిన దుస్థితి ఉందని వెంటనే బిల్డింగ్ మంజూరు చేయాలని కోరారు. గత కొంతకాలంగా పడుతున్న వర్షాల కారణంగా కొండపై నుంచి మట్టి కొట్టుకు వచ్చి ఊరులో పేరుకుపోయిందని మట్టి రాకుండా ప్రహరీ నిర్మించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కుంతేసు పంచాయతీ ప్రెసిడెంట్ చోడి పెంటయ్య, పంచాయతీ మెంబర్లు హిమరక జానకమ్మ, కొంబురమ్మ, రైతు కూలీ సంఘం నాయకులు భారతి, అప్పారావు, కద్రక కోదన్న తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణదారులపై చర్యలు చేపట్టాలి

జిల్లా కేంద్రంలోని మున్సిపల్ పరిధిలో 4వ వార్డులో ఎస్ఎన్ఎం నగర్‌లో ఉన్న బిల్డింగ్, గోర్జిని ఆక్రమించిన వారిపై, మునిసిపాలిటీ అనుమతులు లేకుండా అనధికార లే అవుట్ వేసిన వారిపైన చర్యలు చేపట్టాలని సోమవారం పట్టణ పౌర సంక్షేమ సంఘం కార్యదర్శి పాకల సన్యాసిరావు కోరారు. కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావేదికలో ఆర్డీఒ కె.హేమలతకు ఆయన వినతి పత్రాన్ని అందించారు. ఆర్డీఒ స్పందించి సంబంధిత శాఖ అధికారులకు సమగ్రమైన విచారణ జరిపించి చర్యలు చేపట్టాలని ఫోన్‌లో ఆదేశించారు.



కలెక్టర్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న సిఐటియు నాయకులు

ప్రజల అర్జీలకు వెంటనే పరిష్కారం చూపాలి

పార్వతీపురంరూరల్ : ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో భాగంగా సోమవారం స్థానిక కలెక్టరేట్‌లో డిఆర్ఒ జి.కేశవ నాయుడు, ఆర్డీఒ కె.హేమలత ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా డిఆర్ఒ మాట్లాడుతూ ప్రజలు అందించిన అర్జీలపై వెంటనే స్పందించి పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి 129 అర్జీలు అందాయి. వీటి వివరాలు కొన్ని....

కొమరాడ మండలం కుంతేశుగ్రామపంచాయతీ జాప్పంగి గ్రామానికి రోడ్డు సౌకర్యం కల్పించాలని ఆ గ్రామ సర్పంచి చోడి పెంటయ్య, గ్రామస్తులు కోరారు. ఇదే మండలం దళాయిపేటకు చెందిన కె.విజయ తన కుమారుడిని వికలాంగ ధ్రువపత్రాలు ఉన్న తప్పులను సవరించాలని కోరారు. పార్వతీపురం మండలం గూడారివలసలో మినీ అంగన్వాడీ సెంటర్ ఏర్పాటు చేయాలని కర్రి ఉషారాణి దరఖాస్తు అందజేశారు. మండలంలోని సూడిగాంకు చెందిన మజ్జి దశరథ విభిన్న ప్రతిభావంతుడనని, ఉన్నత విద్య అర్హత కలిగి ఉన్నానని, విభిన్న ప్రతిభావంతుల శాఖ లో ఉద్యోగ అవకాశం కల్పించాలని కోరారు. పార్వతీపురం గ్రామానికి చెందిన జి. పద్మావతి జగనన్న చేయూత డబ్బులు మంజూరు చేయాలని కోరారు. సాలూరు మండలం జీగిరాంలో ఎఫ్ పి షాప్ డీలర్ పోస్టును భర్తీ చేయాలని గ్రామస్తులు, మహిళా సంఘాలు కోరాయి. వారు కోరారు. గుమ్మలక్ష్మీపురం మండలం జర్న గ్రామానికి చెందిన కె.రెల్లమ్మ పిఎంజెపై సంబంధించిన హౌసింగ్ బిల్లులు మంజూరు చేయాలని వినతి పత్రం సమర్పించారు. సీతానగరం మండలం పెదబోగిలికి చెందిన కురమాల కరుణమ్మ తనకు వితంతు పెన్షను మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా మారు రథయాత్ర

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

జిల్లా కేంద్రంలో సోమవారం సాయంత్రం జరిగిన మారు రథయాత్ర కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర పాల్గొని దుర్గ గుడి రోడ్డులో ఉన్న గుడించా మండపంలో కొలువై ఉన్న జగన్నాథ స్వామి, బలరామస్వామి సుభద్రాదేవి విగ్రహాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. విగ్రహాలను ఊరేగింపుగా తీసుకొని రథంపైకి తీసుకొచ్చారు. అనంతరం భక్తులు రథాన్ని లాగుతూ పాత బస్టాండ్ మీదుగా తీసుకువచ్చి జగన్నాథ స్వామి ఆలయం కూడలి ప్రాంతంలో ఉంచడంతో పట్టణ ప్రజలు జగన్నాథ స్వామి దేవత మూర్తులు విగ్రహాలను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, తమ హయాంలో జగన్నాథ స్వామికి కొత్త రథంతో రథయాత్ర నిర్వహించడం ఎంతో సంతోషదాయకమన్నారు. ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతతను సొంతం చేసుకోవచ్చని అన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ టిడిపి, జనసేన, బిజెపి నాయకులు, యాత్రికలు పాల్గొన్నారు.


విగ్రహాల ఊరేగింపులో పాల్గొన్న ఎమ్మెల్యే విజయ్‌చంద్ర

ఘనంగా జగన్నాథుని రథోత్సవం

మక్కువ: మండలంలోని మక్కువ, సీబిల్లి, పెద్దవలస గ్రామాల్లో జగన్నాథుని రెండవ వారం రథోత్సవం సోమవారం వైభవంగా నిర్వహించారు. జగన్నాథుని రథాన్ని ఊరేగింపుగా తీసుకుని వచ్చి మరల జగన్నాథుని విగ్రహాలను గుడిలో పెట్టి ఊరేగింపుని పూర్తి చేశారు. ఈ ఊరేగింపు కార్యక్రమంలో చుట్టుపక్కల గ్రామాల నుండి అధిక సంఖ్యలో భక్తులు జగన్నాథ స్వామిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. జగన్నాథుని రథోత్సవంలో మక్కువలోని టిడిపి సీనియర్ నాయకులు ఎం ప్రసాద్ రావు నాయుడు, పెద్దవలసలో వైసిపి నాయకులు మావుడి రంగునాయుడు స్వామిని దర్శించుకున్నారు. ఈ రథోత్సవంలో గ్రామ యువత తేలు కోటేశ్వరరావు, పూడి శ్రీనివాసరావు, దేవాదాయ శాఖ, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

రెండో విడత ఎసిఎం స్ప్రేయింగ్

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

మండలంలో కేసర, కేసరగూడలో సోమవారం మలేరియా ఎసిఎం పిచికారీ కార్యక్రమం ప్రారంభించారు. ఈ సందర్భంగా తాడికొండ పిహెచ్‌సి వైద్యాధికారి బుద్దేశ్వర రావు మాట్లాడుతూ ఎక్కువ శాతం మలేరియా ఉన్న గ్రామాల్లో ఎసిఎం పిచికారీ నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఇంటి పరిసరాల్లో ఎసిఎం పిచికారీని ప్రతి ఒక్కరూ చేయించుకోవాలని కోరారు. దోమకాటు నుండి రక్షణ పొందేందుకు దోమ తెరలు వాడాలన్నారు. కార్యక్రమంలో మలేరియా సబ్‌యూనిట్ అధికారి మోహన్ రావు, హెచ్ఎఎస్ శ్రీనివాసరావు, ఎంటిఎస్ కేశవరావు, ల్యాబ్ టెక్నీషియన్ రాధాకృష్ణ, పంచాయతీ కార్యదర్శి లక్ష్మి ఉన్నారు.


సీతంపేటం : స్ప్రే చేస్తున్న సిబ్బంది

సీతంపేట: మండలంలో గిరిజన గ్రామాలు కోసంగి, బుడ్డడుగూడ, సంకిలిగూడ, వంభరవెల్లి తదితర గ్రామాల్లో సోమవారం నుంచి రెండోసారి ఐఆర్ఎస్ స్ప్రేయింగ్ సబ్ యూనిట్ అధికారి జె మోహన్ రవు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి స్ప్రేయింగ్ దగ్గరుండి చేయించారు. వైద్యాధికారి భాను ప్రతాప్ స్ప్రేయింగ్‌పై పర్యవేక్షించారు. గిరిజనులకు జ్వరాల పై అవగాహన కల్పించారు.

గ్రామాలకు రోడ్డు సౌకర్యం కల్పించండి

ప్రజాశక్తి - కురుపాం

గిరిశిఖర గ్రామాలకు రహదారి, తాగునీరు, విద్య, వైద్యం తదితర మౌలిక వసతులు ప్రభుత్వం కల్పించాలని గిరిజన సంఘం నాయకులు ఆరిక గంగారావు డిమాండ్ చేశారు. సోమవారం మండలంలో వలసబల్లేరు పంచాయతీ పరిధిలోగల బొడ్డడిగూడ, చాపరాయి గూడ, డోకులుగూడా తదితర గిరిజన గ్రామాలను సందర్శించారు. ఈ సందర్భంగా గోతుల మాయమై, రాళ్ల తేలిన రహదారి వద్ద చేపలు పడుతూ నిరసన తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చి దశాబ్దాలు గడుస్తున్నప్పటికీ గిరిజనుల తలరాతన మాత్రం మారడం లేదని, వారి అభివృద్ధి ఎక్కడ వేసిన గొంగళి అక్కడలా ఉన్నాయని అన్నారు. ఐదేళ్ల క్రితం బొడ్డడిగూడ, చాపరాయి గూడ, డోకులగూడా గ్రామాలకు ఆరకొరగా రోడ్డు వేసి పాలకులు చేతులు దులుపుకున్నారని, దీంతో వర్షాలు పడడంతో పూర్తిగా రోడ్డు పాడై కనీసం అత్యవసర సమయంలో 108 కూడా వెళ్లలేని పరిస్థితి ఉందని, తప్పని పరిస్థితిలో గిరిజన ప్రజలకు ఆరోగ్యం బాగోలేకపోతే డోలీమో తలేనన్నారు. తాగునీటి కోసం మూడు కిలోమీటర్ల కాలినడకన వెళ్లి తెచ్చుకోవాల్సిన పరిస్థితి వస్తుందని, కావున ఈ కొత్త ప్రభుత్వమైన గిరిజన ప్రజల కష్టాలను తక్షణమే పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో గిరిజన సంఘం నాయకులు బి.నగేష్, బి.వెంకటేష్. ఎ.రాజు కుమార్ గిరిజనులు పాల్గొన్నారు.

ప్రజలకు అందుబాటులో ఉండాలి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి -గరుగుబిల్లి

అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండాలని ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి అన్నారు. స్థానిక మండల పరిష త్తు కార్యాలయంలో సోమవారం మండల స్థాయి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలను ప్రజల వద్దకు చేర్చే బాధ్యత అధికార యంత్రాంగం పై ఉందన్నారు. ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో మండలానికి సంబంధించి వరి విత్తనాలు ఎంత మేర పంపిణీ చేశారని, ఎరువులు ఎంత మేర తెప్పించారో వివరాలు తెలియజేయాలని ఎఒ రేగిడి విజయభారతిని అడిగారు. ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో రైతులకు ఎరువులు, ఇబ్బందులు లేకుండా చూడాలని సూచించారు. గతంలో పనిచేసిన ఎంపిడిఒ బోరు మెకానిక్‌గా తన తనయుడను ప్రజాప్రతినిధులకు తెలియకుండా నియమించారని ఈ అంశం పై తగు విచారణ చేపట్టాలని సత్తిబాబు ఎమ్మెల్యేను కోరారు. పలు పాఠశాలల సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. గ్రామాల్లో సమస్యలపై అధికారులు దృష్టి సారించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ఎంపిడిఒ పైల సూర్యనారాయణ, తహశీల్దార్ కె జయ, విద్యుత్ శాఖ ఎఇ బొంతాడ శంకర్రావు, ఎంపిటిసి ద్వారపురెడ్డి సత్యనారాయణ (సత్తిబాబు), కోట భరత్ కుమార్, మరడాన సింహాచలం నాయుడు, సర్పంచ్‌లు అంబటి తవిటినాయుడు, రౌతు గోవిందనాయుడు, బోను చంద్రినాయుడు, టిడిపి నాయకులు మర్రాపు పురుషోత్తంనాయుడు, అక్కేన మధుసూదనరావు, ఎడ్ల శ్రీనువాసరావు, ముదిలిబాబు, నల్ల తిరుపతి నాయుడు, బొచ్చ జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

నకిలీ విత్తన విక్రయాలు అవాస్తవం

ప్రజాశక్తి - వీరఘట్టం

మొక్కజొన్న నకిలీ విత్తనాలు విక్రయాలు అవాస్తవమని స్థానిక మండల వ్యవసాయ అధికారి జె.సౌజన్య అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని జనతా రైతు డిపో దుకాణాన్ని పరిశీలించారు. జియ్యమ్మవలస మండలం పెద్ద బుడ్డిడి గ్రామానికి చెందిన రైతు గురాన శ్రీరామూర్తి 7 కేజీల మొక్కజొన్న విత్తనాలు ఈ ఏడాది మే 29న కొనుగోలు చేసి రెండున్నర ఎకరాల విస్తీర్ణంలో వేశారని, కొంతమేర మొక్కజొన్న విత్తనాలు మొలకెత్తలేదని ఈనెల 14తేదీన శ్రీరామ్మూర్తితో పాటు కొంతమంది రైతులు వచ్చి రైతు డిపో వద్ద ఆందోళన చేసినట్టు వచ్చిన ఫిర్యాదు మేరకు విచారణ చేపడుతున్నామన్నారు. ఎడిఇ లాట్ నెంబర్ 164ఎఫ్1 హైబ్రిడ్ సీడు 160 కేజీలు జనతా రైతు డిపోకు వచ్చాయని, ఇంతవరకు 120 కేజీలు విక్రయాలు జరిగినట్లు వెల్లడించారు. అయితే శ్రీరామమూర్తితో పాటు కొంతమంది రైతులు అదే సమయంలో మొక్కజొన్న విత్తనాలు కొనుగోలు చేసి నాట్లు వేయగా 90 శాతం వరకు పంట బాగా పండినట్లు కొంతమంది రైతులు ఎఒ దృష్టికి తీసుకొచ్చారు. దీంతో ఆమె పంట పొలాలకు వెళ్లి మొక్కజొన్న పంటను పరిశీలించారు. ఏదిఏమైనా మొక్కజొన్న విత్తనాలు విక్రయాలు నకిలీవి కాదని ఆమె స్పష్టం చేశారు. అనంతరం రికార్డులు పరిశీలించారు.

యూట్యూబర్ హర్షసాయి పేరుతో గిరిజనుడికి టోకరా

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

మండలంలోని రెల్ల పంచాయతీ టిక్కబాయికి చెందిన బిడ్డిక సోమేష్ ఇంటర్ పూర్తి చేసి గ్రామంలో వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. సోమేష్‌కు హర్ష సాయి హెల్పింగ్ సెంటర్ నుంచి ఫోన్ చేస్తున్నామని జులై 10న ఫోన్ కాల్ వచ్చింది. మీకు మా నుంచి సహాయం చేస్తామని చెప్పి వాట్సప్‌లో స్కానర్ పెడుతున్నాం, దానికి కొంత డిపాజిట్ చేస్తే మీకు రూ.3లక్షలు పంపుతామని అవతల వ్యక్తి మెసేజ్ పంపించారు. తనకు సహాయం చేస్తారని ఎంతో ఆశపడి అమాయక గిరిజన యువకుడు ముందు రూ.1150 పంపాడు. మళ్లీ మెయిల్ సింక్ అవ్వట్లేదని చెప్పడంతో రూ.2570 పంపమన్నారని బాధితుడు తెలిపారు. అమౌంట్ రాలేదని సోమేశ్ మళ్లీ అడగ్గా లక్ష రూపాయలు పంపామని అది మీ అకౌంట్లోకి రావడానికి జిఎస్‌టి చేయాలని మళ్లీ రూ.9330 వేయమని చెప్పారని తెలిపాడు. వేసి మూడు రోజులు గడిచినా డబ్బులు రాకపోవడంతో మళ్లీ అడగ్గా ఢిల్లీ పోలీస్ ఆఫీసర్ అని ప్రొఫైల్ పేరు ఐపిఎస్ రాహుల్ శర్మ అని మార్చేసి బెదిరించడంతో ఆ గిరిజన యువకుడు లబోదిబోమన్నాడు. యూట్యూబ్ లో హర్ష సాయి చేసిన సేవా కార్యక్రమాలు, వీడియోలు చూసి నిజంగా తనకు సహాయం అందుతుందని ఎంతో ఆశగా ఎదురుచూసిన తనలాంటి వారికి కేటుగాళ్లు టోకరా పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశాడు. నిరుద్యోగ యువతనే లక్ష్యంగా చేస్తూ మోసాలకు పాల్పడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదివాసీ గిరిజన సంఘ నాయకులు డిమాండ్ చేస్తున్నారు.

మోటార్ సైకిళ్లు ఢీకొని ముగ్గురికి గాయాలు

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

ఎదురెదురుగా మోటార్ సైకిళ్లు ఢీకొని ముగ్గురకు తీవ్ర గాయాలైన సంఘటన సోమవారం చోటుచేసుకుంది. పార్వతీపురం మండలం వెంకంపేట గ్రామానికి చెందిన సిరిపురం ఉపేంద్ర నవజ్యోతి ఛానెల్ టివి రిపోర్టర్‌గా పనిచేస్తున్నాడు. మోటార్ సైకిల్ పై వైకెఎం కాలనీకి తన స్నేహితుడు బొంగు శ్రీధర్‌ను తీసుకొని వెళ్తున్నారు. పార్వతీపురం మండలం పెదబొండపల్లి గ్రామానికి చెందిన బండి అజయ్ మోటార్ సైకిల్ పై పార్వతీపురం వైపు వస్తున్నాడు. మార్గం మధ్యలో వెంకంపేట గోలీలు దాటిన తరువాత వాటర్ ప్లాంట్ ఎదురుగా మెయిన్ రోడ్డు వద్దకు వచ్చే సరికి ఎదురెదురుగా వస్తూ ఒకరినొకరు ఢీ కొట్టారు. ఈ సంఘటనలో ముగ్గురకు తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు వెంటనే 108 ద్వారా జిల్లా ఆసుపత్రికి తరలించారు. వైద్యులు చికిత్స అందిస్తున్నారు.

వైద్యం వికటించి యువకుడు మృతి

కురుపాం: ప్రైవేటు వైద్యం వికటించి యువకుడు మృతి చెందిన సంఘటన మండలంలో గుమ్మ గ్రామంలో సోమవారం చోటుచేసుకుంది. బంధువులు అందించిన వివరాలు ప్రకారం.. లాభాల సాయికృష్ణ (30) గత నాలుగు రోజులుగా మలేరియా టైఫాయిడ్ జ్వరంతో బాధపడుతూ గుమ్మలక్ష్మీపురం ఆర్ఎంపి వైద్యున్ని ఆశ్రయించాడు. ఆయన వద్ద చికిత్స పొందు తుండగానే ఆదివారం విరోచనాలు కావడంతో సోమవారం మెరుగైన వైద్యం కోసం శ్రీకాకుళం ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గంమధ్యంలో మృతి చెందినట్లు తెలిపారు. యువకుడు మృతితో గ్రామంలో విషాదఛాయలు అలమకున్నాయి.

పోక్సో కేసు నమోదు

సీతంపేట: మండలానికి చెందిన ఒక బాలిక అదృశ్యంపై ఈ నెల 13న రాత్రి 9గంటలకు తన అక్క ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ ఎం.జగదీశ్‌నాయుడు తెలిపారు. అయితే 14న అదృశ్యమైన బాలిక సీతంపేట పోలీస్ స్టేషన్‌కి వచ్చి, తాను అదృశ్యమవ్వలేదని హైదరాబాద్‌లో ఉద్యోగం ఇప్పిస్తానని విజయనగరం జిల్లా చీపురుపల్లి మండలం గచ్చలవలస గ్రామానికి చెందిన గొర్లె సింహాచలం అనే వ్యక్తి తనను మోసం చేసి తీసుకెళ్లి విశాఖపట్నంలో ఒక గదిలో పెట్టి పలుదఫాలుగా అత్యాచారం చేసి, చేతులతో కొట్టి, గాయపర్చినట్లు బాలిక ఎస్ఐకు తెలిపినట్లు చెప్పారు. అప్పటికే మిస్సింగ్ కేసుగా నమోదవడంతో దాన్ని మార్చి ఫోక్స్ కేసుగా నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.